క్లుప్తంగా

ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం నిర్వహించుకోవాలి

పామూరు: వినాయక నిమజ్జనోత్సవం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ ఆర్.రామరాజు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌వద్ద మంగళవారం నిమజ్జనోత్సవంపై పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. నిమజ్జనోత్సవంలో ఎలాంటి కవ్వింపు చర్యలు లేకుండా ఉండాలని, విగ్రహకమిటీల వారు బాధ్యతగా ప్రవర్తించి నిమజ్జనంలో పాల్గొనాలన్నారు. ఎస్సై కే.సురేష్ యాదవ్, హిందు, ముస్లింలు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు సర్వే

● ఈఆర్‌ఓ నారదముని



ఓటరు సర్వేపై సమీక్షిస్తున్న ఈఆర్‌ఓ నారదముని

కొండపి(సింగరాయకొండ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటరు సర్వే కార్యక్రమం కొండపి నియోజకవర్గంలో పూర్తి పారదర్శకతతో చేస్తున్నామని ఈఆర్‌ఓ వి.నారదముని పేర్కొన్నారు. కొండపి రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ఓటరు సర్వేపై ఆరు మండలాల తహసీల్దార్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు సర్వే విధానం, పోలింగ్ కేంద్రాల మార్పు గురించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. అనంతరం కొండపి మండల కేంద్రంలోని 137వ నెంబరు పోలీస్‌స్టేషన్‌ను ఈఆర్‌ఓ పరిశీలించారు. గతంలో పోలింగ్ కేంద్రం పాఠశాలలోని 20వ నంబర్ గదిలో ఉండగా మరమ్మతుల కారణంగా ఆ గదిని కూల్చివేయడంతో 5వ నంబర్ గదికి మార్చినట్లు ఈఆర్‌ఓ వివరించారు. ఆయన వెంట ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే సహించం



రికార్డులు పరిశీలిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: సచివాలయాల సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 6 వ వార్డు సచివాలయాన్ని మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. సచివాలయ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించి, ప్రజలకు సత్వర సేవలందించాలన్నారు. లబ్ధిదారులను ఇబ్బంది పెట్టినా, అవినీతికి పాల్పడినట్లు ప్రజల నుండి ఫిర్యాదులు అందినా ఉపేక్షించేది లేదన్నారు. కౌన్సిలర్లు దాసరి మురళీ కృష్ణా, సయ్యద్ రిజ్వాన ఖాలక్, సచివాలయ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బాలవికాస కేంద్రం ప్రారంభం

హనుమంతునిపాడు: మండల పరిధి మహమ్మదాపురం గ్రామ పంచాయతీ పరిధి రాజుగారిపల్లి దళితవాడలో సర్పంచ్ పి.శ్రీనివాసరెడ్డి సోమవారం బాలవికాస కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి వారి సహకారంతో ఏర్పాటు చేస్తున్న బాలవికాస కేంద్రం సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాత్రి సమయంలో చిన్నారులకు అందించే విద్యా బోధన సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగ్గురు జూదరులు అరెస్టు

టంగుటూరు: మండలంలోని ఎం.నిడమానూరు శివారులో పేకాట శిబిరంపై సోమవారం ఎస్సై ఖాదర్ బాషా తన సిబ్బందితో దాడి చేశారు. ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకుని, రూ.7600 నదదు, సెల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

దండాలయ్యా..ఉండ్రాళ్లయ్యా..

● ఘనంగా వినాయక చవితి వేడుకలు

కనిగిరి రూరల్: విఘ్నేశ్వరుని అనుగ్రహం, ఆశీస్సులతో ప్రతి ఒక్కరికి మంచి జరగాలని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. వినాయక చవితి పండుగ సందర్భంగా పట్టణంలోని పలు చోట్ల కొలువైన బొజ్జ గణపయ్యలకు ఎమ్మెల్యే బుర్రా మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరికీ క్షేమ, స్థైర్య, ఆయురారోగ్యాలు, సకల సంపదలు సిద్ధించాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, వైస్ చైర్మన్‌లు పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, ఆర్ మాణిక్యరావు, జేసీఎస్ కన్వీనర్ వేల్పుల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు తమ్మినేని సుజాత శ్రీరాంరెడ్డి, రామనబోయిన శ్రీను, దాసరి మురళీ, దేవకి సత్యావతి, సొసైటీ చైర్మన్ సంగు సుబ్బారెడ్డి, ఏపీ ఎంసీ సభ్యుడు డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా, మాజీ ఏఎంసీ డైరక్టర్ బొట్టు శ్రీను తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు సత్యన్నారాయణరెడ్డి, పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డిలు వేర్వేరుగా ప్రత్యేక పూజలు చేశారు. చింతల చెరువు సత్యన్నారాయణరెడ్డి పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఆలయ కమిటీల నాయకులు సత్యన్నారాయణరెడ్డిని ఘనంగా సన్మానించారు. పార్టీ నాయకులు వీరంరెడ్డి బ్రహ్మరెడ్డి, మూలె గోపాల్‌రెడ్డి, ఎం రమణారెడ్డి, ఫణీ తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి వేడుకలను మండలంలో నిర్వహించారు. కనిగిరి పోలీస్ డివిజన్ పరిధిలోని మూడు సర్కిల్‌లు, 9 పోలీస్‌స్టేషన్ల పరిధిలో సుమారు 300 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఒక్క కనిగిరిలోనే సుమారు 120 విగ్రహాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని ప్రతి వీధిలో వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేయడంతో పండుగ వాతావరణం శోభిల్లింది. పాతూరు, కొత్తపేట, ఇందిరాకాలనీ, ఎన్జీఓ కాలనీ విగ్రహాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. వాల్మీకి వీధిలో భారీ ఎత్తు విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆయా విగ్రహాల వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు అలరించాయి. పాతూరులోని దివంగత మాజీ ఎమ్మెల్యే రామసుబ్బారెడ్డి ఇంటి వద్ద ఉన్న చెట్టు వద్ద ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం అందిరీని అలరించింది. మతసామరస్యతకు ప్రతీకగా అన్ని వర్గాల ప్రజలు వచ్చి పూజలు చేశారు. పాతూరులో, మంగళిమాన్యంలోని విగ్రహాల వద్ద జరిగిన అన్నదాన కార్యక్రమాలను మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, కౌన్సిలర్‌లు దాసరి మురళీ కృష్ణా, సయ్యద్ రిజ్వాన ఖాలక్ ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంపీడీఓ చీమలమర్రి ప్రసాద్‌రావు, భూతలపల్లి మాలకొండారెడ్డి, మాజీ జెడ్పీటీసీ భూతలపల్లి ఈశ్వరమ్మ, చిరంజీవి, సుదర్శన్, స్థానిక పార్టీ నాయకులు, గృహ సారధులు, పాల్గొన్నారు.



వినాయకునికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్



మోపాడులో వినాయక పూజలు నిర్వహిస్తున్న హుసేన్‌రెడ్డి, నాయకులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అయ్యలూరివారిపల్లెలో వైఎస్సార్ సీపీ నాయకుడు ముత్యాల నారాయణరెడ్డి, సర్పంచ్ ముత్యాల భారతిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో గ్రామస్తులు వినాయక కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి ముందు వినాయక, సిద్ధి బుద్ధిఅమ్మవార్లకు వారు పట్టువస్త్రాలు, నగలు, ముత్యాలను వేడుకగా ఆలయం వద్దకు ఉత్సవంగా తీసుకువచ్చారు. అనంతరం ఆలయం వద్ద సకల గణాధిపతి విఘ్నేశ్వరుని విగ్రహమూర్తికి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం కనులపండువగా సాగింది. పి.శివరామక్రిష్ణ, రామిరెడ్డి, ముత్యాల రమణారెడ్డి, జయవర్ధన, జి.తిరుపతిరెడ్డి, మౌనిక, అనసూయ, నారాయణమ్మ, నిఖిత, ప్రీతి, భక్తులు పాల్గొన్నారు.

పామూరు: వినాయక చవితి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. పందిళ్లు ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను ఉంచి పూజలు చేశారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వినాయక ఉత్సవాలను కొన్ని గ్రామాల్లో 3 రోజులపాటు మరికొన్ని గ్రామాల్లో 5 రోజుల పాటు నిర్వహించనున్నట్లు విగ్రహ కమిటీ సభ్యులు తెలిపారు. కాగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సీఐ కే.శ్రీనివాసరావు, ఎస్సై సురేష్‌యాదవ్‌లు ప్రత్యేక గస్తీ, టీంలు ఏర్పాటుచేసి ప్రశాంత వాతావరణలో వినాయక ఉత్సవాలు నిర్వహించుకునేలా చర్యలు చేపట్టారు.

మండలంలోని మోపాడు, గంగానగర్‌లో ఏర్పాటుచేసి వినాయక మండపాల్లో మంగళవారం వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, గట్లా విజయబాస్కర్‌రెడ్డి, సర్పంచ్ చప్పిడి వరలక్ష్మి, గాజులపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, పలువురునాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు.

వెలిగండ్ల: వినాయకచవితి వేడుకలు మండలంలో వైభవంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలో గణపతి విగ్రహాలను భారీగా ఏర్పాటు చేశారు. వెలిగండ్ల, మొగళ్లూరు, గోకులం , కంకణంపాడు, రామగోపాలుపురం, గుడిపాటిపల్లి, కటికిందపల్లి, మరవగుంట్ల, ఉమ్మడచెరువు, బూడిదపాలెం, కొటాలిపల్లి, రాళ్లపల్లి, నాగులవరం గ్రామాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించారు. విగ్రహాల వద్ద కోలాటం, భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనంతరం అన్నదానాలు చేశారు.



అయ్యలూరివారిపల్లెలో వినాయక కల్యాణోత్సవం భక్తులు



పామూరులో పూజల్లో పాల్గొన్న భక్తులు

హనుమంతునిపాడు: మండలంలో వినాయకచవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో గనంగా నిర్వహించారు. మండలంలో హనుమంతునిపాడు, వేములపాడు, రాజుగారిపల్లి, గాయంవారిపల్లి, సీతారాపురం, కూటాగుండ్ల, హాజీపురం, తిమ్మారెడ్డిపల్లి, దాసరిపల్లి మొరవారిపల్లి గ్రామాల్లో ఊరూవాడా విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించారు. విగ్రహాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. డీఎస్పీ రామరాజు దంపతులు కోటతిప్పలో నిర్వహించిన చవితి వేడుకల్లో పాల్గొని దంపతులు ఇద్దరు గణేష్‌నికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వేములపాడులో మంగళవారం స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. రాజుగారిపల్లిలో దళితవాడలో వినాయకుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాసరిపల్లిలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీలో విజేతల మహిళలకు బహుమతులు అందజేశారు. అన్నదానం నిర్వహించారు.

పీసీపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం వినాయక చవితి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పండగ సందర్భంగా ప్రతిఒక్కరు ప్రాతఃకాలమునే పత్రిని కొనుగోలు చేసి ప్రతి ఇంట పూజలు చేశారు. అలాగే వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

సింగరాయకొండ: వినాయక చవితి పర్వదినాన్ని కొండపి నియోజకవర్గంలో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. చలువ పందిళ్లలో గణేశ్ విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో ఆర్యవైశ్య గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లక్ష వినాయకులతో రూపొందించిన బంగారు గణపతి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జీవీఆర్ రోడ్డు, బాలయోగినగర్, డ్రైవర్ పేట, మార్కెట్ సెంటర్ తదితర ప్రాంతాల్లో విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా పూజించారు.

టంగుటూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు. టంగుటూరు వాణి నగర్లో వినాయక విగ్రహం వద్ద వైఎస్సార్ టీఎఫ్ నాయకులు సూదనగుంట వెంకటస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు పంపిణి చేశారు.

మర్రిపూడి: మర్రిపూడి పడమటి, తూర్పు బజారులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మర్రిపూడిలో వైఎస్సార్ అభిమానుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద యువకులు ఉట్టికొట్టే కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.

పొన్నలూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో సుమారు 50 గణేష్ విగ్రహాలను భక్తులు ఏర్పాటు చేశారు. మండలపాలను విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కొన్ని గ్రామాల్లో యువకుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.



కొండపి మండలం కుమ్మరిపాలెంలో..



పొన్నలూరు బ్రహ్మంగారి గుడి వద్ద..



రాజుగారిపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



హనుమంతునిపాడులో పూజలు చేస్తున్న



వెలిగండ్లలో వినాయక విగ్రహానికి పూజలు



వాల్మీకి వీధిలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన వినాయకులు



పాతూరులో గణపతికి పూజలు చేస్తున్న భక్తులు



టంగుటూరులో వినాయకునికి పూజలు చేస్తున్న భక్తులు



మర్రిపూడి పడమటి బజారులో గణేశుడికి పూజలు

చవితి వేడుకలతో ప్రజల్లో ఐకమత్యం

● వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు



ప్రత్యేక పూజల్లో వరికూటి దంపతులు, ఆర్య వైశ్య ప్రముఖులు

సింగరాయకొండ: వినాయకచవితి వేడుకలను ప్రజలు కలిసికట్టుగా నిర్వహించుకుంటారని, తద్వారా ఐకమత్యం ఏర్పడుతుందని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో ఆర్యవైశ్య గణేష్ ఉత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బంగారు విగ్రహానికి మంగళవారం రాత్రి టీటీడీ ట్రస్టు బోర్డు సభ్యుడు శిద్దా సుధీర్‌బాబు, రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, శిద్దా సూర్యప్రకాశరావుతో కలిసి వరికూటి దంపతులు పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథులను విగ్రహ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. పూజా కార్యక్రమంలో భాగంగా 108 మంది మహిళలు హారతులివ్వడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళల కోలాట ప్రదర్శన ఆహూతులను అలరించింది. అనంతరం లడ్డూ వేలం నిర్వహించారు. సీఐ దాచేపల్లి రంగనాథ్, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, ఆర్యవైశ్య నాయకులు, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్ పామర్తి మాధవరావు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం చేయాలి



నల్లమడుగులలో పనులు పరిశీలిస్తున్న ఎంఈఓ

సీఎస్‌పురం (పామూరు): మండలంలో నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంఈఓ-2 రాజాల కొండారెడ్డి అన్నారు. మండలంలోని నల్లమడుగుల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుదీకరణ పనులను, పనులు పూర్తయిన నూతన గదులను, వరండా ఫ్లోరింగ్ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్మాణపనులు వేగవంతం చేయాలన్నారు. ఐఎఫ్‌పీ ప్యానళ్లద్వారా, స్మార్ట్ టీవీల ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని ఆనికాలపల్లి, నల్లమడుగుల ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేయడంతో పాటు ఉప్పలపాడు ప్రాథమికోన్నతపాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రతి పాఠశాలలో విధిగా మెనూ అమలుచేయాలని, హాజరుశాతం పెంచాలని ఉపాధ్యాయులకు సూచించి రికార్డులను పరిశీలించారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



ముండ్లమూరివారిపాలెం విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది



పచ్చవ హైస్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

పొన్నలూరు:

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు మండలంలోని ముండ్లమూరివారిపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎన్ శివరామకృష్ణ మంగళవారం తెలిపారు. ఈ నెల 16వ తేదీన మైనంపాడు జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన హాకీ బాలికల జిల్లా జట్టు ఎంపిక పోటీలో ఎస్.యశ్విత, కె.మధుచందన, యు.ఇందుమతి, ఎం.దీప్తి, బాలుర జట్టు ఎంపికలో పి.క్రాంతికుమార్, టి.కిరణ్‌కుమార్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని వివరించారు. జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల్లో బాలికల విభాగంలో మైథిలి, స్వాతి, దీప్తి, మనీష, బాలుర విభాగంలో యజ్ఞేశ్వర్‌రెడ్డి, చెన్న, అభిమన్యు పతకాలు పొందారు. క్రీడాకారులకు ఆట వస్తువులు అందిస్తామని దాతలు కొండపి విశ్వేశ్వరరావు, ముళ్లమూరి వెంకటేశ్వర్లు ప్రకటించారు. అభినందన కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీకుమారి, ఎస్ఎంసీ చైర్మన్ కేశవరావు, పీడీ గుమ్మా శ్రీదేవి, దగ్గుబాటి శ్రీనివాసులు, చక్కా కేశవరావు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు పచ్చవ విద్యార్థులు

జరుగుమల్లి: మండలంలోని పచ్చవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం ఎ.వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా జె.పంగులూరి మండలం, బూదవాడ జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ జట్టు ఎంపికలో అండర్-14 బాలుర విభాగంలో ఎం.మహిత్ అభిలాష్, అండర్-14 బాలికల విభాగంలో వై.అఖిల, అండర్-17 బాలికల విభాగంలో దేపూరి పూజిత సత్తా చాటారని వివరించారు. వీరు గుంటూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులతోపాటు పీడీ పాలేటి రమేష్‌ను పాఠశాల సిబ్బంది అభినందించారు.